“మరి... ఇంకెందుకు కాన్సిల్ అయ్యింది? బుచ్చిబాబుకి సినిమాల్లోలా గుడ్డి చెల్లెలో, కుంటిచెల్లెలో వుండి దాని పెళ్ళయ్యేదాకా నేను చేసుకోను అనిగానీ అన్నాడా?”

సీత విరక్తిగా నవ్వింది.

“అలా అన్నా బాగుండేది. కాని ఇప్పుడు పెళ్ళిచేసుకోనని అంటున్నాడు.”

తలగడలో తల దాచుకుని భోరుమంది. రాధ ఆశ్చర్యపోయింది.

“అంత హఠాత్తుగా ఆ నిర్ణయం ఏంటి....కొంపదీసి నీమీద ఏదైనా అనుమానం వచ్చిందా?”

సీత తల అడ్డంగా ఊపింది.

“మరి దేనికి కాన్సిల్ అయింది” ఆత్రంగా అడిగింది రాధ.

సీత మంచంమీదనుంచి లేచి కూర్చుని కళ్లు తుడుచుకుని సాయంత్రం తనకూ బుచ్చిబాబుకూ జరిగిన సంభాషణ గురించి చెప్పడం మొదలుపెట్టింది. సీత చెప్పేదాన్ని రాధ నోరు తెరుచుకుని ఆశ్చర్యపోతూ వినసాగింది.

0 0 0

బుచ్చిబాబుకి పని మీద మనసు అస్సలు లగ్నం కావడంలేదు. ఏకాంబరం ఫైలు తెరిచినా సీత కన్నీళ్లు పెట్టుకున్న మొహమే కనిపిస్తోంది. కొంపదీసి నేను తీసుకున్న నిర్ణయం సరయినది కాదేమో అని అతని మనసుకి అనిపించినా సీత బాధపడుతూ వుండడచేత అలా అనిపిస్తుందేమో గాని అది సరయిన నిర్ణయమే అనిపించసాగింది అతనికి ఆలోచించగా ఆలోచించగా.

కొత్తగా ఎవరయినా ఏదయినా పనిచేస్తే బాధపడాల్సిందే. మొదటిసారిగా విధవని వివాహం చేసుకున్న వాడు ఎన్ని బాధలు పడ్డాడో మరి తెలుసా?

మొదటిసారిగా కులాంతర, మతాంతర వివాహం చేసుకున్నవాళ్లు ఏ ఏ సమస్యల్ని ఎదుర్కొన్నారో మనకి తెల్సా?

ఇదీ అంతే. ఈనాడు విమర్శించినవాళ్లే రేపు సమర్థిస్తారు. సీతకి ఈవేళ తన నిర్ణయం సిల్లీగా అనిపించినా రేపు ఇది తెలివయిన నిర్ణయం అని తనే వప్పుకుంటుంది. కానీ సీత బాధపడుతుంటే బుచ్చిబాబు మనసు కరిగిపోయింది.

అలా కరిగిపోతే లాభంలేదు. తన నిర్ణయాన్ని మార్చుకోవాల్సి వస్తుంది.
సీత బాధపడుతుందికదా అని ఇప్పుడు పెళ్లి చేసుకుంటే ఇద్దరి మధ్య ప్రేమ నశించి జీవితాంతం యిద్దరూ బాధపడాల్సి వస్తుంది.

ఇప్పుడు సీత పడుతున్న బాధ కేవలం తాత్కాలికమయింది. జీవితాంతం ప్రేయసీ ప్రియులుగా శాశ్వతమయిన ఆనందాన్ని పొందవచ్చని సీతకు ఇప్పుడే తెలీదు. కాని క్రమేణా తను ఆ నిజం గ్రహిస్తుంది అనుకున్నాడు బుచ్చిబాబు.

క్రితంరోజు సీత బాధపడుతూ వెళ్లిపోయిన సంఘటన అతనికి గుర్తువచ్చింది. బుచ్చిబాబు ఉండబట్టలేక సీత ఆఫీసుకి ఫోన్ చేశాడు .

"హలో....ఎవరు?" అడిగింది అవతలి కంఠం.

" సీత కావాలండీ" అన్నాడు బుచ్చిబాబు.

"మీకు ఎవరు కావాలి అని నేను అడగలేదు. మీరెవరని  అడుగుతున్నా"

బుచ్చిబాబుకి వళ్లు మండింది. ఇలా అధిక ప్రసంగం మాట్లాడారంటే తప్పకుండా వాడు సీత బావగాడే అయివుంటాడు.

"నేను? వల్లకాట్లో రామనాధాన్ని సీతని పిలుస్తారా?" పళ్లు కొరుకుతూ అన్నాడు బుచ్చిబాబు.

"ఒహోహో వల్లకాట్లో రామనాధమా? ఇదివరకోసారి మీరు ఫోన్ చేశారు కదూ?" అడిగింది అవతలి కంఠం.

"అవును" చెప్పాడు బుచ్చిబాబు.

"మీది దిబ్బ అన్నారు ...    అవునా ?  "

"ఎస్. మేము దిబ్బలోళ్లమె! ఇప్పుడైనా సీతని పిలుస్తారా?"

"మీ దిబ్బవాళ్లు ఎక్కువగా ఏ ప్రాంతంలో ఉంటారండీ?" అడిగింది అవతలి కంఠం.

బుచ్చిబాబుకి సహనం నశిస్తోంది "రాయలసీమ ప్రాంతంలో ఎక్కువగా ఉంటారు. ముఖ్యంగా దిబ్బకర్రు గ్రామంలో మొత్తం మా వాళ్ళే వుంటారు" కసిగా నవ్వుతూ అన్నాడు బుచ్చిబాబు.

"అలా చెప్పండి. రాయలసీమతో నా కెక్కువగా టచ్‌లేదు. అందుకే మీ గురించి నేనెక్కువగా వినలేదు. చాలా గమ్మత్తుగా ఉందే" అన్నాడు అవతలి వ్యక్తి.'

'సరేగానీ ఇప్పటికైనా సీతని పిలుస్తారా?" అన్నాడు బుచ్చిబాబు .

"సీత ఈ వేళ ఆఫీసుకి రాలేదు" చల్లగా చెప్పి ఫోన్ పెట్టేసింది  అవతలి కంఠం.

అది విన్న బుచ్చిబాబుకి గట్టిగా కెవ్వుమని కేకేసి గట్టిగా జుట్టుపీక్కుని కసిగా నెత్తిన మొట్టుకోవాలనిపించింది.

కానీ సెక్షన్‌లో వాళ్ళు చూస్తే బాగుండదని ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నాడు. సీత ఆఫీసుకు రాలేదంటే బుచ్చిబాబుకి కంగారు పుట్టింది.

సీత ఒంట్లో బాగోలేదా? లేకపోతే నిన్నటి తన ప్రవర్తనకి మానసికంగా దెబ్బతిని ఆఫీసుకు రాలేదా?

బుచ్చిబాబు గబగబా మరో నెంబర్ డయల్ చేసాడు. అది సీత హాస్టల్ నెంబర్.

"హలో.....వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్!" అంది అవతల నుండి ఒక ఆడగొంతు. బహుశా వార్డెనేమో!

"హలో.... ఏమండి ఓసారి సీతని పిలుస్తారా?" రిక్వెస్టింగ్‌గా అడిగాడు బుచ్చిబాబు

"ఈ టైమ్‌లో సీత ఇక్కడెందుకుంటుంది. ఆఫీసులో వుంటుంది" విసుక్కుంటూ సమాధానం ఇచ్చింది అవతల కంఠం.

బుచ్చిబాబుకి కోపం వచ్చినా తమాయించుకుని అడిగాడు "అది కాదండీ సీత ఆఫీసుకు ఇప్పుడే ఫోన్ చేసాను. ఈ వేళ ఆమె ఆఫీసుకు రాలేదని చెప్పారు."

"అలాగా సీత ఇక్కడకూడా లేదు. ఆఫీసని చెప్పి ఆ సీత ఏ రాముడితో షికారు కొడ్తుందో మరి" అని ఫోన్ డిస్కనెక్టు చేసేసింది ఆమె.

"డామిట్ సిల్లీ మనుషులూ, సిల్లీ వ్యవహారాలు!" విసుగ్గా రిసీవర్ పెట్టేశాడు బుచ్చిబాబు . సీత ఆఫీసుకు వెళ్ళలేదూ, హాస్టల్లోనూ లేదంటే ఇంకెక్కడి కెళ్ళింది?

కొంపదీసి తను తీస్కున్న నిర్ణయానికి బాధపడి ఏ బావిలోననో దూకి అత్మహత్య చేస్కోడానికి వెళ్ళలేదు కదా?

సిల్లీగా ఆలోచిస్తూ అనుకున్నాడు బుచ్చిబాబు.

ఛీ.... ఛీ.... సీత ఆత్మహత్య చేస్కునేంత పిరికిమనిషి కాదు. తనకు తెలిసి సీత ఎటువంటి పరిస్థితినైనా ధైర్యంగా ఎదుర్కోగల మనిషి. మరి సీత ఎక్కడికి వెళ్ళినట్టో!

"సార్... మిమ్మల్ని అయ్యగారు పిలుస్తున్నారు. పొద్దున రాగానే మీకేదో ఫైలిచ్చారంటగా...దాన్ని తీసుకుని రమ్మన్నారు" ఆలోచిస్తూ వుండిపోయిన బుచ్చిబాబుతో ప్యూన్ అన్నాడు.

ఒక్క అయిదు నిముషాల్లో వస్తున్నానని చెప్పు" ప్యూన్‌తో అన్నాడు బుచ్చిబాబు. ఆలోచనల్లోపడి ప్రక్కనపెట్టిన ఆ ఫైలుని తీసి సగం రాసిన నోటింగ్‌ని పూర్తిచేసి ఏకాంబరం క్యాబిన్‌లోకెళ్ళి ఆయన ముందు పెట్టాడు బుచ్చిబాబు .

ఏకాంబరం నోటింగ్ మొత్తం చదివి "నువ్వో పెద్ద ఠంగుఠలాకీ వోయ్! యూకెన్‌గో" అన్నాడు.

బుచ్చిబాబు వెనక్కి తిరిగి గుమ్మం వైపు రెండుగులు వేసాడు "ఏమోయ్ నిన్నే" ఏకాంబరం పిలిచాడు.

బుచ్చిబాబు వెనక్కి తిరిగి చూసాడు.

"ఏంటీ వెళ్ళిపోతున్నావ్" ఆశ్చర్యంగా చూస్తూ అడిగాడు ఏకాంబరం.

"మీరేకదా సార్. యూకెన్‌గో అన్నారు?" అంతకంటే ఆశ్చర్యంగా ప్రశ్నించాడు బుచ్చిబాబు.

"అవును... అన్నాను గానీ నువ్వేంటీ నేను నిన్ను ఠంగుఠలాకీ అని అంటే అది తిట్టో లేకపోతే పొగడ్తో తెలుసుకోకుండా పోతున్నావ్?"

“అలా అడిగి తెలుసునే మూడ్‌లో నేనిప్పుడు లేను సార్!”

“అదేంటోయ్ త్వరలో పెళ్ళి చేసుకోబోతున్నావ్ - నీ మూడ్ బాగోలేదంటే ఎలా? మరీ బుస్కుగాడిలా మాట్లాడకు” అన్నాడు ఏకాంబరం.

“లేదు సార్. మా పెళ్ళిక్యాన్సిల్ అయ్యింది సార్” చెప్పాడు బుచ్చిబాబు.

ఏకాంబరం ఆశ్చర్యంగా బుచ్చిబాబు వంక చూసాడు.

“క్యాన్సిల్ అయిందా?”..... అదేం?”

“మా జాతకాలు అస్సలు కలవలేదంట సార్.... జాతకం ప్రకారం నేను మేకయితే తను సింహం అంటా సార్. మాకు పొత్తు కుదర్దు సార్.”

“అయినా టంగోటోస్కాయ్‌గాడిలా నువ్వు కూడా ఈ జాతకాలనీ నమ్మతావటోయ్?”

“నేను నమ్మడం కాద్సార్! ఇదంతా మా అమ్మానాన్నల నిర్ణయం సార్”

“పోనీ జాతకాలనీ నమ్మితే నమ్మారుగానిమీ జాతకలు మంచి సిద్ధాంతికే చూపించారా లేకపోతే ఏ కిల్లారికిత్తిగాడికో చూపించారా?”

“లేదు సార్ ఈ సిటీలోనే ఫేమస్ అయిన పిలకల గుండుశాస్త్రి సిద్ధాంతికి చూపించాం సార్”

“ఓ ఐసీ!” తల పంకించాడు ఏకాంబరం .

0 0 0

సాయంత్రం

ఆఫీసు నుండి ఇంటి కెళ్ళగానే బుచ్చిబాబు మీద మండి పడ్డాడు పర్వతాలరావు.

“సన్నాసి వెధవా, ఏబ్రాసి వెధవా, పింజారీ వెధవ, తింగిరివెధవా, వెధవన్నర వెధవా....”

“ఏంటి నాన్నా... నేను ఆఫీసు నుండి త్వరగానే వచ్చాగా.... ఎందుకలా తిడ్తావ్?” విసుక్కుంటూ అన్నాడు బుచ్చిబాబు.

“అవునండీ పాపం” అంది పార్వతమ్మ.

“అందుకనే తిడ్తున్నా! పెళ్ళిరోజు దగ్గర పడ్తుందా... అసలు వీడేమైనా పట్టించుకుంటున్నాడా? ఇది వరకు ఆఫీసు నుండి ఊరంతా బలాదూర్ తిరిగి ఇంటికి ఆలస్యంగా వచ్చేవాడు. ఇప్పుడు చూడు పెళ్ళి పనులు బోల్డు పెట్టుకుని ఎంచక్కా ఇంటికెలా త్వరగా వచ్చేస్తున్నాడో? ఏరా వెధవాయ్.... నువ్వు పెళ్ళి బట్టలు ఎప్పుడు కొంటావ్, టైలర్‌కి ఎప్పుడిస్తావ్? ఆ పెళ్ళి శుభలేఖలు ఎప్పుడు అచ్చేయిస్తావ్.... అవి అందరికి ఎప్పుడు పంచుతావ్? ఇంకా బోల్డు పన్లున్నాయి...” చిందులేస్తూ అన్నాడు పర్వతాలరావు.

“నేను పెళ్ళి చేసుకోవడం లేదు నాన్నా” మెల్లగా అన్నాడు బుచ్చిబాబు.

పర్వతాలరావు, పార్వతమ్మ ఇద్దరూ ఉలిక్కిపడి చూసారు అతని వైపు.

“ఏరా జోకులేస్తున్నావా?” అన్నాడు పర్వతాలరావు నాలుగు క్షణాల తరువాత.

“అవేం జోకులురా పాపం” అంది పార్వతమ్మ.

“జోకులు కాదమ్మా..నిజంగానే అంటున్నా” నసిగాడు బుచ్చిబాబు.

“ఏం ఎందుకని చేసోకవు? ఆ అమ్మాయి లక్షణంగా వుంది. పైగా నువ్వే ఏరికోరి చేసుకుంటానన్న అమ్మాయి చెప్పరా బద్మాషెధవా!” గంతులేసాడు పర్వతాలరావు.

బుచ్చిబాబు గొంతులో పచ్చివెలక్కాయ్ పడింది.

నిజమే... సీత తను ప్రేమించిన అమ్మాయి. ఎందుకు చేసోకడం లేదంటే ఏమని చెప్తాడు? సీత నచ్చలేదని చెప్పలేడు. అలాగని అసలు కారణం చెప్తే పీక మీద కాలేసి తొక్కుతాడు పర్వతాలరావు.

“చెప్పరా పనికిమాలిన వెధవా” అరిచాడు పర్వతాలరావు.

“అదీ....మరీ...” నసిగాడు బుచ్చిబాబు.

“ఏంటా నసుగుడు? సడన్‌గా కొజ్జాగా మారిపోయావా ఏంటి? అందుకే పెళ్ళొద్దంటున్నావా?”

“త్వరగా చెప్పరా పాపం! ఆయన్నెందుకలా అరిపిస్తున్నావు?” అంది పార్వతమ్మ.

“సీత ఎలాంటిదో తెలీక ప్రేమించాను నాన్నా ఆ అమ్మాయి కారెక్టర్ మంచిదికాదని నాకీవాళే తెల్సింది” చటుక్కున అనేశాడు బుచ్చిబాబు. అలా అంటే తప్ప ఆ పెళ్ళి ఆగదని అతనికి తెలుసు.

“ఆ!”

పర్వతాలరావు, పార్వతమ్మ నోళ్ళు తెరిచారు.

రెండు రోజులుగా బుచ్చిబాబు సీతని కలవాలని చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. సీత ఆఫీసుకు వర్కింగు ఉమెన్స్ హాస్టల్‌కి ఫోన్ చేస్తే రూమ్‌లో లేదని సమాధానం!
సీత ఉండీ లేదని చెప్పిస్తోందని బుచ్చిబాబుకి అనిపించింది.

చివరికి మూడోరోజు ఆఫీసుకు ఫోన్ చేస్తే సీత దొరికింది. నీతో మాట్లాడాలి పార్కుకి రమ్మని బుచ్చిబాబు సీతను కోరితే ఆమె నిరాకరించింది.

కానీ అది మన భవిష్యత్తుకి సంబంధించిన విషయం. చాలా ముఖ్యమైన విషయం అని బుచ్చిబాబు బ్రతిమిలాడ్తే చివరికి సరేనంది సీత.

సాయంత్రం ఆరు గంటలైంది. అప్పటికి అరగంట నుండీ బుచ్చిబాబు సీత కోసం అక్కడ రెస్ట్ లెస్‌గా ఎదురుచూస్తున్నాడు. అతని ఆలోచనలు పరపతి విధాలుగా పోతున్నాయి.

అయిదున్నరకే వస్తానన్న సీత ఆరు అయినా రాలేదేంటీ? తను ఊరికే బలవంతం పెడ్తుంటే అప్పటికి వస్తానని అందేమో? సీత రాదేమో.

బుచ్చిబాబు దీర్ఘంగా నిట్టూర్చాడు. సీత పడ్తున్న బాధ బుచ్చిబాబుకి తెలుసు. కానీ సీత బాధపడ్తుంది కదా అని కరిగిపోయి “సరే సీతా.... నీ ఇష్టం” అంటే తన ఆదర్శం

మొత్తం నాశనం అవుతుంది.

సీత ఇప్పుడు బాధపడినా తర్వాత తప్పక ఆనందిస్తుంది. తన బాధంతా ఇద్దరి ఆనందం కోసమే కదా! భవిష్యత్తులో తమ జంట ప్రేమించుకునే యువతీ యువకుల జంటలకు ఆదర్శం కావాలి.

బుచ్చిబాబు ఆలోచనలు ఇలా సాగుతూ వుండగానే మరో పావుగంట గడిచింది. ఈలోగా బుచ్చిబాబు కూర్చున్న బెంచికి కాస్త దూరంలో వున్న మరో బెంచిమీద భార్యాభర్తల జంట వచ్చి కూర్చుంది.

వాళ్ళని చూడగానే బుచ్చిబాబుకి వాళ్లు భార్యాభర్తలని అర్థం అయిపోయింది. ఇద్దరి మొహాల్లో నిరాసక్తత ఎవరి బలవంతం మీదనో పార్కుకి వచ్చినట్టు!

ఒక్కరి మొహంలో చిరునగవు లేదు. మొగుడు ఒక దిక్కుకి చూస్తుంటే పెళ్ళాం మరో వైపు చూస్తోంది. ఓ మాటా మంతీ ఏమీలేదు. ఇలాంటి జీవితాన్ని సీత కోరుకుంటుంది?

నో..... అలా కాకూడదు. ఎలాగైనా సరే సీత కళ్లు తెరిపించాలి అనుకున్నాడు.

కానీ సీత వస్తేగా?

సీత వస్తానన్న సమయానికి అప్పుడే ముప్పావుగంట ఆలస్యం అయిపోయింది. సీత ఇంక రాదు అన్న నిర్ణయానికి వచ్చిన బుచ్చిబాబు ఇంటికి వెళ్ళిపోవాలని బెంచిమీద నుంచి లేచి నిలబడ్డాడు.

అదే సమయంలో దూరంగా సీత రావడం అతనికి కనిపించింది. బుచ్చిబాబుకి ఆనందం కలిగింది. అతని మనస్సు కాస్తంత తేలికపడింది. కాని సీతని తను అనుకున్న విషయంలో వప్పించడం అంత తేలికయిన విషయం కాదని అతనికి తెలుసు.

సీత బుచ్చిబాబుని సమీపించిది.

“రా..... సీత ......రా! కూర్చో!” అన్నాడు బుచ్చిబాబు.

సీత మెల్లగా బెంచిమీద కూర్చోంది. ఆమె మొహంలో ఏ విధమయిన ఎక్స్‌ప్రెషన్‌లేదు. బుచ్చిబాబు కూడా ఆమె ప్రక్కన కూర్చున్నాడు.

“ఇంత అలస్యం అయితే నువ్విక రావేమో అనుక్కున్నాను” అన్నాడు బుచ్చిబాబు.

“ఆఫీసులో అర్జంట్ పనేదో తగిలి ఆలస్యం అయింది” చెప్పింది సీత బుచ్చిబాబు మొహం వంక కాకుండా ఎటో చూస్తూ.

“నామీద కోపం వచ్చిందా?” మెల్లగా ఆడిగాడు బుచ్చిబాబు .

సీత ‘ఊ’ అనలేదు ‘ఆ’ అనలేదు. అలా ఎటో చూస్తూనే ఉంది.

“ఇంతకి నువ్వు ఏం నిర్ణయించుకున్నావు సీత?” అడిగాడు.

“అంటే నీ నిర్ణయంలో ఏ మార్పు రాలేదన్నమాట? నువ్వింకా నీ నిర్ణయం మార్చుకుని నన్ను పిలిచావనుకున్నా” అంది సీత కాస్త సీరియస్‌గా.

అలా అంటున్నప్పుడు కూడా ఆమె బుచ్చిబాబు మొహం వంక చూడలేదు.

పరిస్థితి ఇలా సీరియస్‌గానే వుంటుందని బుచ్చిబాబుకి తెలుసు. ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి సిద్ధపడే వచ్చాడు బుచ్చిబాబు.

సీత మానసికంగా సెటిల్ అవడం కోసం ఓ అయిదు నిముషాలు అగి తరువాత చర్చ ప్రారంభించాలని అనుకున్నాడు బుచ్చిబాబు. అందుకే మౌనంగా ఉండిపోయాడు. అతని దృష్టి ప్రక్క బెంచి వైపు మళ్ళింది. ఆ భార్యాభర్తలిద్దరూ ఒకరితో ఒకరు ఒక్కముక్క కూడా మాట్లాడుకోవడం లేదు.

అప్పుడే వారి దగ్గరికి శనగలూ. బటానీలు అమ్మే కుర్రాడు వచ్చాడు.

"సార్.....వేడి వేడి శనగలు, బఠానీలు కావాలా సార్?" ఆ కుర్రాడు భర్తని ఆడిగాడు.

"వద్దు బాబూ....వెళ్లు" కాస్త చికాకుగా సమాధానం చెప్పాడు భర్త.

బఠానీలు అమ్మే కుర్రాడు రెండడుగులు ముందుకు వేశాడు.

"ఇదిగో బాబూ....ఇలారా" అంటూ భార్య వాడిని పిలిచింది.

ఆ కుర్రాడు బేరం తగిలిందన్న ఆనందంతో మళ్ళీ వాళ్ల దగ్గరికి వచ్చాడు.

"వాడినెందుకు పిలిచావు?" భార్యవంక క్రూరంగా చూస్తూ అడిగాడు భర్త.